క్లుప్తంగా

ఓటమి భయంతోనే అనుచిత వ్యాఖ్యలు

బిజినేపల్లి: రాష్ట్రంలో ఖాళీ అవుతున్న బీఆర్‌ఎస్ పార్టీ తరుపున ఎంపీగా పోటీ చేస్తున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ ఓడిపోతాననే భయంతో స్థానిక ఎమ్మెల్యే కుచుకుళ్ల రాజేష్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకుడు శ్రీనివాస్ బహదూర్ అన్నారు. ఆదివారం తిమ్మాజిపేట మండల కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. రాజ్యాంగబద్ధంగా ఎన్నుకోబడిన రాజేష్‌రెడ్డి నకిలీ ఎమ్మెల్యే అని చేసిన వ్యాఖ్యలకు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్ బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

వేసవి శిబిరం ప్రారంభం



తాడూరు: జిల్లా యువజన క్రీడా శాఖ ఆధ్వర్యంలో మండలంలోని మేడిపూర్‌లో వాలీబాల్ వేసవి ఉచిత శిక్షణ శిబిరం ప్రారంభించారు. క్రీడాకారులు శ్రీనివాసులు, అంజి, లింగం మాట్లాడుతూ.. ఉచిత శిక్షణ శిబిరాన్ని యువకులు వినియోగించుకోవాలన్నారు. క్రీడాకారులకు కావాల్సిన వసతులు, సహకారం ఉంటుందన్నారు.

రాచూర్‌లో క్రికెట్ టోర్నీ



వెల్దండ: మండలంలోని రాచూర్‌లో ఆదివారం ఆర్‌పీఎల్ సీజన్-4 క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు రాజు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారులు క్రికెట్‌లో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ప్రతి ఏడాది వేసవిలో రాచూర్ ప్రీమియర్ లీగ్ మ్యాచ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్, ప్రశాంత్, రాజు, సతీష్, శ్రావణ్, భాస్కర్, సలేశ్వరం, శ్రీను, ప్రహ్లాద్, సతీష్ ఉన్నారు.

సేవ చేయడం అభినందనీయం



అచ్చంపేట రూరల్: రక్షిత మహిళా సొసైటీ ఆధ్వర్యంలో కొన్నేళ్లుగా అంబలి కేంద్రం ఏర్పాటు చేసి బాటసారుల దాహార్తిని తీర్చి సేవ చేయడం అభినందనీయమని కౌన్సిలర్ శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ సభ్యుడు చంద్రమోహన్ అన్నారు. ఆదివారం వారు అంబలి కేంద్రం నిర్వహణకు రూ.5వేలు అందించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షురాలు జయమ్మ, సభ్యులు పాల్గొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడుకుందాం

తెలకపల్లి: మతోన్మాద బీజేపీని ఓడించి, భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం మండల కేంద్రమైనలో సీపీఎం మండల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం 10 ఏళ్ల మోదీ పాలన ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందన్నారు. మతం, దేవుడి పేరుతో ప్రజల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతూ, విభజిస్తూ మతోన్మాద రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగాన్ని రద్దు చేసి మత రాజ్యాంగాన్ని స్థాపించాలని ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కుల వ్యవస్థను బలోపేతం చేయడం ద్వారా దేశసమైక్యతకు, గ్రామీకుల ఐక్యతకు ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశాన్ని పట్టి పీడిస్తున్న మతోన్మాద బీజేపిని గద్దె దించాలంటే ఇండియాకూటమి కాంగ్రెస్ పార్టీకి ఓటేయ్యాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాస్కర్, విజయ్‌గౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమ్మేళనం జయప్రదం చేయండి

మన్ననూర్: అచ్చంపేటలోని లోటస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం నిర్వహించే ఆర్యవైశ్య ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయాలని చేయాలని ఆ సంఘం నాయకుడు శ్రీనివాసులు ఆదివారం పిలుపునిచ్చారు. పార్లమెంట్ ఎన్నికల్లో అందరం కలిసి ఓ నిర్ణయానికి వచ్చే దిశగా సమావేశంలో చర్చ ఉన్నందున నియోజక వర్గంలోని ఆర్యవైశ్యులంతా సమ్మేళనానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం

బల్మూర్: మండలంలోని చెన్నారంలో ఆదివారం త్రైత సిద్ధాంత-ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సాయిశంకర్, మనోహర్, నిరంజన్ సుధాకర్, తిరుపతి, రమాదేవి, స్వప్న, మంజుల పాల్గొన్నారు.

నిఘా నీడలో గ్రామాలు

- చోరీలను అరికట్టేందుకు గ్రామాల్లో సీసీ కెమెరాలు

పెంట్లవెల్లి: విపరీతంగా చోరీలు, అమాయకులకు మాయమాటలు చెప్పి డబ్బులు, బంగారం ఎత్తుకుపోవడం, మోటర్‌సైకిళ్ల తదితర వస్తువులు ఎత్తుకెళ్లడం లాంటివి మండల కేంద్రంలో గతంలో చాలా చోటు చేసుకున్నాయి. దీంతో పోలీసు యంత్రాంగం ఎన్నోసార్లు దొంగలను పట్టుకునే ప్రయత్నంలో ఇబ్బందులు పడేవారు. రెండేళ్ల క్రితం మండల కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో కాస్త చోరీలకు అడ్డుకట్ట పడింది. గతంలో పెంట్లవెల్లిలో ప్రతి మంగళవారం సంత జరుగుతుండడంతో చుట్టుపక్కల పలు గ్రామాల నుంచి ప్రజలు వస్తుంటారు. ఆ రోజు మండల కేంద్రం ఎంతో రద్దీగా కనిపిస్తుంది. అది గమనించిన దొంగలు ఎన్నోసార్లు వృద్ధుల వద్ద బంగారం, డబ్బులు ఎత్తుకెళ్లారు. పోలీసులకు ఇలాంటివి చాలా ఫిర్యాదులు అందాయి. దీంతో పోలీసులు, స్థానిక నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని మండల కేంద్రంలో దాదాపు రూ.6 లక్షల వ్యయంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అంతేకాకుండా మండల కేంద్రంతోపాటు గ్రామాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని పోలీసులు గ్రామాలలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. గ్రామస్తులను ఒప్పించి విరాళాలు సేకరించి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తున్నారు.

గ్రామాలలో మోటార్ల చోరీలు..

రెండు నెలల క్రితం మండలంలోని మాధవస్వామి



మాధవస్వామినగర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

నగర్, మల్లేశ్వరం, జటప్రోల్‌లో రైతులు ఏర్పాటు చేసుకున్న కరెంట్ మోటార్లు, తీగలను ఎత్తుకెళ్లడంతో స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వెంటనే పోలీసులు స్పందించి దొంగలు పట్టుకొని రైతులకు పరిహారం ఇచ్చారు. ఇది మళ్లీ పునరావృతం కాకుండా ఉండాలని పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ మాధవస్వామినగర్, జటప్రోల్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. మంచాలకట్ట, మల్లేశ్వరం, గోపులాపూర్, ఎంగంపల్లితండా, కొండూరులో కెమెరాల ఏర్పాటుకు మరికొద్ది రోజులలో కృషి చేస్తున్నట్లుగా ఆయా గ్రామాల ప్రజలు నిర్ణయించారు.



పెంట్లవెల్లిలో ప్రధాన రహదారిపై సీసీ కెమెరాలు

ప్రతి పల్లెలో కెమెరాలు



మండలంలో ఉన్న ప్రతి గ్రామంలో ప్రజలతో మాట్లాడి గ్రామగ్రామానికి సీసీ కెమెరాల ఏర్పాటుకు కృషి చేస్తాం. ఇప్పటికే పెంట్లవెల్లి, మాధవస్వామినగర్, జటప్రోల్‌లో ఏర్పాటు చేశాం. కెమెరాల ద్వారా ఏ గ్రామంలో దొంగతనం కాకుండా చూస్తాం.

– రామన్‌గౌడ్, ఎస్‌ఐ, పెంట్లవెల్లి

కాంగ్రెస్ హయాంలో మహిళలకు ప్రాధాన్యం



అచ్చంపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



వెల్దండ మండలం చెర్కూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

అచ్చంపేట రూరల్: తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీ రుణం తీసుకోవడానికి, రాష్ట్ర ప్రజలకు ఇదే సరైన సమయమని, కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఎన్నికల ఏఐసీసీ పరిశీలకుడు పీవీ మోహన్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాలులో పార్టీ మహిళా సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు అన్ని రంగాల్లో రిజర్వేషన్లను, హక్కులను కల్పించిన ఘనత ఇందిరాగాంధీకి దక్కిందన్నారు. పార్లమెంట్ ఎన్నికల మేనిఫెస్టోలో మహిళలకు అధిక ప్రాధాన్యతనిస్తూ సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రాజభాన్సిదేవి, జెడ్పీటీసీ డాక్టర్ అనురాధ, రాము యాదవ్, శారదమ్మ, సునీత, సుశీల పాల్గొన్నారు.

అన్న గెలుపు కోసం తమ్ముడు ప్రచారం..

లింగాల: నాగర్‌కర్నూల్ పార్లమెంట్‌కు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి గెలుపు కోసం తమ్ముడు మల్లు ప్రసాద్ ఆదివారం మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. రాజకీయంలో పాలన అనుభవం ఉన్న మల్లురవికి మద్దతు ఇచ్చి గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో వెంకటయ్య, కిషన్‌నాయక్, వెంకట్రాం, తేజ, హఫీజ్, నిరంజన్, ఇందిరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలో ఆదివారం కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కాంగ్రెస్ హయాంలోనే ప్రజలందరికి న్యాయం లభిస్తుందని వారు వివరించారు. మల్లురవి గతంలో ఎంపీ ఉండి అభివృద్ధి చేశారన్నారు. కార్యక్రమంలో యాదయ్య, రాముడు, శేఖర్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక..

కోడేరు: మండల కేంద్రానికి చెందిన వివిధ పార్టీల నుంచి మాజీ ఎంపీపీ కొత్త రామ్మోహన్‌రావు, కోఆప్షన్ మెంబర్ అబ్దుల్‌ఖరీం, జగదీశ్వరావురావు అధ్వర్యంలో ఆదివారం వంద మందికి పైగా కాంగ్రెస్ పార్టీలో చేరారు.

వెల్దండ: పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధికంగా కాంగ్రెస్ పార్టీ ఎంపీలను గెలిచి దేశంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆదివారం నారాయణపూర్, చెర్కూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో మోతిలాల్‌నాయక్, భూపతిరెడ్డి, పర్వత్‌రెడ్డి, సంజీవ్‌కుమార్, సురేందర్‌రెడ్డి, జంగయ్య, కృష్ణముదిరాజ్, పుల్లయ్య తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: మండలంలోని మర్చాలలో కాంగ్రెస్ నాయకులు ఇంటింటి ప్రచారం చేశారు. కార్యక్రమంలో శ్రీధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎంజీకేఎల్‌ఐ కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

ఉప్పునుంతల: ఉప్పునుంతల శివారులోని ఎంజీకేఎల్‌ఐ కాల్వ దాటడానికి బ్రిడ్జి లేకపోవడంతో రైతులు పొలాలకు వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నల్లచెరువుకట్ట నుంచి పడమటి వైపు ఉన్న బండ్లగొంక దారి గుండా గ్రామానికి చెందిన దాదాపు 20 మంది రైతులు పొలాల్లోకి వెళ్లేవారు. ఆ ప్రాంతంలో ఎంజీకేఎల్‌ఐ కాల్వను తవ్వి అక్కడ దాటడానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా వదిలేశారు. దీంతో కిలోమీటరు దూరం వెళ్లి కటికొల్ల గడ్డ వద్ద ఉన్న బ్రిడ్జి వద్ద దాటాల్సివస్తుందని రైతులు వెంకట్‌రెడ్డి, బొందయ్య, నర్సింహ, సత్యనారాయణ, తిర్పతయ్యలు తెలిపారు. కాల్వను తవ్వే సమయంలో పలుమార్లు అక్కడకు వచ్చిన అధికారులు, కాంట్రాక్టర్‌కు సమస్యను వివరించగా అక్కడ బ్రిడ్జి వేస్తామని చెప్పి చివరకు వేయలేదని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మైసమ్మ ఆలయంలో భక్తుల రద్దీ



పెద్దకొత్తపల్లి: నాయనోనిపల్లి మైసమ్మ జాతరకు ఈ ఆదివారం భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని ఆదివారం తెల్లవారుజామునే భక్తులు వచ్చారు. భక్తులను చేరవేసేందుకు నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, వనపర్తి, అచ్చంపేట ఆర్టీసీ డిపోల వారు ప్రత్యేక బస్సులను నడిపించారు. ఈ ఆదివారం 6వేల మంది భక్తులు హాజరైనట్లు ఎండోమెంట్ అధికారి రంగారావు తెలిపారు.

త్వరలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రావడం ఖాయం



యాదిరెడ్డిపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి



బొప్పల్లిలో ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తాడూరు: త్వరలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం వస్తుందని, మళ్లీ కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని ఎమ్మెల్యే మర్రిజనార్దన్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూలిపోతుందని వ్యాఖ్యానించారు. 10 ఏళ్ల బీఆర్‌ఎస్ పాలనలో మాత్రమే రాష్ట్రం అభివృద్ధి జరిగిందన్నారు. ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే గ్యారంటీల పేరుతో మోసం చేశారన్నారు. కార్యకర్తలు ధైర్యంగా ఉండి బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపించాలన్నారు.

తెలకపల్లి: మండలంలోని బొప్పల్లిలో బీఆర్‌ఎస్ నాయకులు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని నాగం శశిధర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో అర్థం రవి, చిన్ననర్సింహ, మల్లేష్, భగవంత్‌రావు పాల్గొన్నారు.

కల్వకుర్తిరూరల్: మున్సిపల్ చైర్మన్ ఎడ్మసత్యం ఆదివారం పట్టణంలోని ఇందిరానగర్‌తోపాటు పలు కాలనీలలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ శాహెద్, కౌన్సిలర్ సైదుగౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం



గోదల్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



కొల్లాపూర్‌లో ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

బల్మూర్: మండల కేంద్రంతో పాటు గోదల్, కొండనాగుల, తోడెళ్లగడ్డ, తుమ్మెన్‌పేటలో ఆదివారం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలో ఉంటేనే పేద ప్రజలకు అన్ని సంక్షేమ పథకాలు అందుతాయని వివరించారు. పెద్దయ్య, రమణగౌడ్, గడెల,రమేష్,కానుగుల బాలకృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

కొల్లాపూర్: బీజేపీ నాయకులు ఆదివారం పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థి భరత్‌ప్రసాద్‌ను గెలిపించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో సందు రమేష్, కద్దాల కృష్ణ, ధనుంజయ్‌గౌడ్, శివకృష్ణయాదవ్, ఎల్లయ్య యాదవ్, మహేష్, మద్దిలేటి, పరమేష్ తదితరులున్నారు.

కల్వకుర్తిరూరల్: దేశాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్లడానికి మోదీ గ్యారంటీగా ఉంటారని బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 11వ వార్డులో ఇంటింటి ప్రచారం చేశారు.

సభాస్థలి పరిశీలన



కల్వకుర్తి: మాజీ మంత్రి కేటీఆర్ 8న కల్వకుర్తి పర్యటనకు రానున్నారు. ఆదివారం మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మున్సిపాల్ చైర్మన్ ఎడ్మసత్యంతో కలిసి సభాస్థలిని పరిశీలించారు. మొదట పట్టణంలోని స్టేడియం గ్రౌండ్ హెలిప్యాడ్ ప్రాంతాన్ని పరిశీలించి సభ నిర్వహించే ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌ను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ కేటీఆర్ సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట విజయ్‌గౌడ్, మనోహర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

లింగాల: మండలంలోని కోమటికుంట మాజీ సర్పంచ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చీమర్ల రాంరెడ్డి(75) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. కోమటికుంట సర్పంచ్ రెండు పర్యాయాలు పని చేశారు. మృతిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ, మండల నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

నల్లమలలో మోస్తరు వర్షం

మన్ననూర్: నల్లమల అటవీ సరిహద్దు ప్రాంతాలు మల్లెలతీర్థం సమీపంలోని గ్రామాలు, అటవీ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. వేసవికాలం, ఎండ తాపానికి ఉక్కపోతతో ప్రజలు భరించలేకుండా ఉన్న సమయంలో కొంతమేరకు వర్షం కురవడంతో వాతావరణం కొంచెం చల్లబడింది. మల్లెలతీర్థం, కుడిచింతల బైలు, సార్లపల్లి గ్రామాలతో పాటూ అటవీ సరిహద్దు ప్రాంతాల్లో వర్షం కురిసింది.



నా బిడ్డను ఆశీర్వదించండి

- నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు

తెలకపల్లి: తన బిడ్డను ఆశీర్వదించి ఎంపీగా గెలిపిస్తే అండగా ఉండి అభివృద్ధి చేస్తాడని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు అన్నారు. ఆదివారం మండలంలోని కార్వంగలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన అనంతరం ప్రధాన కూడలిలో మాట్లాడారు. తాను ఎంపీగా ఉండి ఈ ప్రాంతాన్ని ఎంతో అభివృద్ధి చేశానని.. ఇప్పుడు బీజేపీ నుంచి తన కుమారుడు పోతుగంటి భరత్‌ప్రసాద్ పోటీ చేస్తున్నారని తెలిపారు. సుపరిపాలన బీజేపీతోనే సాధ్యమని.. నరేంద్రమోదీని మూడోసారి ప్రధానిని చేసే బాధ్యత మనందరిపై ఉందన్నారు. అయోధ్యలో వందల ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామాలయ నిర్మాణం పూర్తి చేశారని, దేశ ప్రజలందరికి ఉచితంగా 5 కిలోల రేషన్ బియ్యం అందిస్తున్నారని వివరించారు. అచ్చంపేట, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యేలు తన కుమారుడిని ఎదగకుండా అవకాశం వచ్చిన ప్రతిసారి అడ్డుతగిలి ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. అలాంటి నాయకుల మాటలు నమ్మొద్దని, కారు గుర్తుకు ఓటేసి మోసపోవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని తెలిపారు. బీజేపీ ప్రజల సంక్షేమం కోసం పాటు పడుతుందని.. కమలం గుర్తుకు ఓటేసి తన బిడ్డను ఎంపీగా గెలిపించి పార్లమెంటుకు పంపాలని అభ్యర్థించారు. ఆయన వెంట పార్టీ నాయకులు సుబ్బారెడ్డి, తిరుపతయ్య, కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి కొత్తపల్లి రవికుమార్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి బాబుసాగర్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఎన్నికల ప్రచారంలో ఎంపీ పోతుగంటి రాములు

కేంద్రం నిధులతోనే గ్రామాల్లో అభివృద్ధి పనులు

ఊర్కొండ: కేంద్ర ప్రభుత్వ నిధులతోనే గ్రామాల్లో ఎల్‌ఈడీ బల్బులు, సీసీరోడ్లు, వైకుంఠధామాలు వంటి అభివృద్ధి పనులు చేపట్టారని బీజేపీ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ అన్నారు. ఆదివారం ఆమె ఊర్కొండపేటలోని పబ్బతి ఆంజనేయస్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఊర్కొండపేట, ఊర్కొండ, ముచ్చర్లపల్లి, తిమ్మసానిపల్లి, రేవల్లి, మాధారం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మోదీ గెలుపు కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చేయని అభివృద్ధి, పదేళ్లలో బీజేపీ చేసి చూపించిందన్నారు. దేశంలో మోదీ పేద ప్రజల కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారని తెలియజేశారు. కాంగ్రెస్ రూ.2 లక్షల రుణమాఫీ అని, అధికారంలోకి వచ్చి, ఇప్పుడు మాట మార్చారని అని తెలియజేశారు. మే 13న కమలం గుర్తుపై ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ నాయకురాలు బాలత్రిపుర సుందరి, జనార్దన్ రెడ్డి, ఓర్సు ఆంజనేయులు, పరశురాం, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాధారంలో మాట్లాడుతున్న డీకే అరుణ

సెలవులను సద్వినియోగం చేసుకోండి

అచ్చంపేట రూరల్: విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోవాలని కళాకారుడు రఘుపతి అన్నారు. స్వర్ణభారతి కళానిలయం ఆధ్వర్యంలో పట్టణంలోని న్యూ ఎక్సీడ్ ఉన్నత పాఠశాలలో ఆదివారం వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 17ఏళ్ల కళా అనుభవం కలిగిన స్వర్ణభారతి కళానిలయం వారు పట్టణంలో వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు చేయడం సంతోషమని, చిన్నారులు సెలవులు వృథా కాకుండా కళను నేర్చుకోవాలన్నారు. చదువుతో పాటు ఇలాంటి కళల్లో ఆరి తేరాలని, శిబిరంలో ఎక్కువ మంది పాల్గొని దిగ్విజయం చేయాలని కోరారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు నారోజు మోహన్ మాట్లాడుతూ.. 30 రోజుల పాటు కొనసాగే శిబిరంలో కూచిపూడి, జానపద, పాశ్చాత్య నృత్యాలతో పాటు లలిత సంగీతం, సంగీత వాయిద్యాలలో శిక్షణనిస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి నరేషాచారి, నృత్య గురువు అంజి, కల్యాణ్ పాల్గొన్నారు.



శిబిరంను ప్రారంభిస్తున్న చంద్రమోహన్

మార్క్స్ ఆశయాలను కొనసాగిస్తాం



నివాళి అర్పిస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: మానవాలి మనుగడకు మార్క్సియిజం ప్రాణవాయువులాంటిదని ప్రపంచ పోరాటాలకు స్ఫూర్తి మార్క్సిజం అని దానిని రాసిన కారల్‌మార్క్స్ ప్రపంచ గమనానికి స్ఫూర్తి దాయకం అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు శ్రీనివాసులు అన్నారు. ఆదివారం కారల్ మార్క్స్ జయంతిని జిల్లా కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పెట్టుబడిదారి వ్యవస్థలో కార్మికులు, ప్రజలు చాలా దోపిడికి గురి అవుతుంటే దాన్ని నిలవరించేందుకు మార్క్సియిజం మహోన్నత మార్గాన్ని ఇచ్చిందని మానవాలి అభివృద్ధి తోడ్పాటును అందించిందని గుర్తు చేశారు. దోపిడి చేసే వర్గాలపై గొడ్డలిపెట్టు లాంటిదన్నారు. కార్యక్రమంలో అశోక్, సత్యనారాయణ, నర్సింహ, క్రాంతి, శివరాం, వెంకటయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

వర్గరహిత దోపిడీ లేని సమాజానికి కృషి

కల్వకుర్తి రూరల్: వర్గరహిత దోపిడీ లేని సమాజం కోసం కృషి చేయడమే కారల్‌మార్క్స్ ఆశయమని ఎంప్లాయిస్‌వాయిస్ ఎడిటర్ వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం పట్టణంలోని సీపీఎం కార్యాలయం ఆవరణలో కారల్‌మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి ఆయన జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, మల్లయ్య, బాల్‌రెడ్డి, శ్రీనివాసులు, జగన్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆనంద్‌కుమార్, ఆంజనేయులు, మల్లయ్య, బాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఆదర్శవంతులుగా నిలవాలి

నాగర్‌కర్నూల్ రూరల్: సమాజానికి క్రీడాకారులు ఆదర్శవంతంగా నిలవాలని సీఐ కనకయ్యగౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దముద్దునూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. శిక్షణలో ఉన్న క్రీడాకారులను పరిచయం చేసుకుని మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాలలో ఇలాంటి శిక్షణలు ఏర్పాటు చేసినందుకు అభినందించారు. శిక్షణ శిబిరాలు గ్రామీణ క్రీడాకారులకు మంచి భవిష్యత్‌ను ఇస్తాయని తెలిపారు. రాబోయే రోజుల్లో జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులు రాణించాలని సూచించారు. విద్యార్థుల చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని స్వచ్ఛమైన గాలిని ఆస్వాదించేందుకు క్రీడా ప్రాంగణాలు చాలా తక్కువగా ఉన్నాయని పెద్దముద్దునూర్ పాఠశాల ఆవరణలో ఇంత మంచి క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేయడం శుభదాయకం అన్నారు. ఆటలతో మానసిక రుగ్మతను శారీరకంగా, మానసికంగా ఎదగవచ్చని తెలిపారు. చదువు, ఇతర రంగాలలోను రాణిస్తే మంచి మెరుగైన అవకాశాలు ఉంటాయని, రిజర్వేషన్ కోటా ద్వారా ఉద్యోగాలు పొందవచ్చని తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో పాల్గొంటున్న శిరీష, మమత, విష్ణు, మణికంఠ, పర్వేష్ చిన్న క్రీడాకారులను సన్మానించారు.



క్రీడాకారులను అభినందిస్తున్న సీఐ రమేష్

సభకు తరలిన కాంగ్రెస్ నాయకులు



పెంట్లవెల్లి నుంచి తరలివెళ్తున్న కార్యకర్తలు

కొల్లాపూర్: అలంపూర్ నియోజకవర్గం ఎర్రవల్లిలో నిర్వహించిన రాహుల్‌గాంధీ సభకు ఆదివారం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు తరలివెళ్లారు. పట్టణంలో వార్డుల వారీగా, గ్రామాల నుంచి ఇన్‌చార్జిల నేతృత్వంలో పార్టీ శ్రేణులు వాహనాల్లో సభకు భయలుదేరారు.

పెంట్లవెల్లి: మండలంలోని మంచాలకట్ట, మల్లేశ్వరం, గోపులాపూర్, జటప్రోల్ నుంచి కాంగ్రెస్ నాయకులు జనజాతర మహాసభకు బయలుదేరారు. మండల అధ్యక్షుడు నర్సింహయాదవ్, డబ్బ రాములు, జాగటి నిరంజన్, డబ్బ గోవిందు, కొట్టంకురుమయ్య, కొత్తకృష్ణయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తెలకపల్లి: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాలు ఇలా.. పెద్దపల్లికి చెందిన మోతల బాలస్వామి(60) శనివారం తెలకపల్లికి వచ్చి పని ముగించుకొని తిరిగి పెద్దపల్లికి టీవీఎస్ ఎక్సెల్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. గౌరెడ్డిపల్లి చౌరస్తాలో లింగాల వైపు నుంచి వస్తున్న వల్లభాపూర్‌కి చెందిన అకిల్ బైక్‌ను నిర్లక్ష్యంగా నడిపి బాలస్వామి ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన బాలస్వామిని హైదరాబాద్ తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలియజేశారు. మోతల మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలియజేశారు.